మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
శుక్రవారం, 25, సెప్టెంబర్, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM

### రికార్డ్ బ్రేక్ : రూ.39 లక్షలు పలికిన
## బాలాపూర్ లడ్డూ



**హైదరాబాద్ :** బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ముగిసింది. ఏటేటా భక్తుల్లో అంచనాలను పెంచుతూ దేశ విదేశాల్లోని తెలుగు వారిని ఆకర్షించే ఈ లడ్డూ వేలం పాట, ఈ ఏడాది మరింత రసవత్తరంగా సాగింది. ఈసారి నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయిలో రూ.39 లక్షలు పలికింది. ఈసారి వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, చివరికి ప్రణీత్ ?రెడ్డిని అదృష్టం వరించింది. గతేడాది బాలాపూర్ లడ్డూ రూ.35 లక్షలు పలికిన సంగతి తెలిసిందే. 32 ఏళ్లుగా లడ్డూ వేలం పాటఖైరతాబాద్ వినాయకుడి తర్వాత భాగ్యనగరంలో అందరి దృష్టిని ఆకర్షించేది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట. ఇక్కడి గణపయ్య చేతిలో ఉండే లడ్డూ వేలం పాటతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుంది. లడ్డూను ఎవరు దక్కించుకుంటే వారింట సిరి సంపదలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అందుకే గణేశుడి లడ్డూ వేలం పాట కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. 32 ఏళ్లుగా ఇక్కడ లడ్డూ వేలం పాట కొనసాగుతుంది. చాలా ప్రాంతాల్లో లడ్డూ వేలం పాటలు నిర్వహిస్తున్నప్పటికీ, ఇక్కడి వేలం పాటపై తరతరాలుగా సర్వత్రా ఆసక్తి కొనసాగుతోంది.ప్రతి ఏటా నిర్వహిస్తున్న వేలం పాటలో లడ్డూ రికార్డు స్థాయి ధర పలుకుతుంది. అందుకే భక్తులంతా బాలాపూర్ లడ్డూ వేలం పాట కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తుంటారు. 1994 సంవత్సరంలో రూ.450తో మొదలైన లడ్డూ వేలం, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ.వందలు, రూ.వేలు దాటి అత్యధికంగా రూ.లక్షలు పలుకుతోంది. స్థానికులు, స్థానికేతరుల మధ్య జరిగే ఈ వేలం పాటలో నువ్వా-నేనా అన్నట్లు వేలం జరుగుతుంది.ఏటా లెక్క మారుతుంది2001 వరకు బాలాపూర్ లడ్డూ రూ.వేలల్లోనే పలికింది. 2002లో తొలిసారిగా కందాడ మాధవరెడ్డి రూ.1.5 లక్షలకు లడ్డూ దక్కించుకున్నారు. ఆ తర్వాత ఏడాది నుంచి ఒక్కో రూ.లక్ష పెరుగుతూ వచ్చింది. 2007లో స్థానికుడు రఘునందన చారి రూ.4.15 లక్షలకు పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు. అప్పటి వరకు ఒక్కో రూ.లక్ష పెరుగుతూ వచ్చిన లడ్డూ ధర, ఆ సంవత్సరం ఏకంగా రూ.2 లక్షలు దాటింది. 2015లో బాలాపూర్ లడ్డూ రూ.10 లక్షలు దాటి రికార్డు సృష్టించింది. కల్లెం మదన్ మోహన్ రెడ్డి రూ.10.32 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.2016లో రూ.4 లక్షలు పెరిగింది. ఆ సంవత్సరం మేడ్చల్?కు చెందిన స్కైలాబ్ రెడ్డి రూ.14.65 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. 2017లో నాగం తిరుపతి రెడ్డి రూ.15.60 లక్షలకు లడ్డూ పొందగా, 2018లో స్థానికేతరుడు తేరేటి శ్రీనివాస్ గుప్తా రూ.16.60 లక్షలకు బాలాపూర్ లడ్డూను దక్కించుకున్నారు. 2020లో కరోనా కారణంగా వేలం వేయకుండా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్?కు లడ్డూ అందజేశారు. గతేడాది రూ.35 లక్షలు పలికిన ఈ లడ్డూ, ఈసారి ఆ ధరను దాటి రికార్డు స్థాయిలో రూ.39 లక్షలు పలికింది.: కిషన్ రెడ్డి

### కేసీఆర్ భూములపై విచారణకు
## ప్రత్యేక కమిటీ



**- 16 అంశాలతో జాబితా: భూ అక్రమాలు,**

**హైదరాబాద్ :** ఆక్రమణల గుట్టు విప్పేందుకు శాసనసభ సమావేశాల్లో సీఎం రేవంత్?రెడ్డి ప్రకటించిన మేరకు ప్రభుత్వం ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికోసం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 అంశాలపై విచారణ చేయాలని నిర్ణయించింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు, కేటీఆర్, హరీశ్‌రావులతోపాటు వారి కుటుంబసభ్యులు, ఇంకొందరు బీఆర్ఎస్ నేతలకు సంబంధించి ఆయా గ్రామాల్లోని భూముల వివరాలను విచారణ అంశాల్లో చేర్చింది. వీరి ఆధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి. వీటితో పాటు ఎసైన్డ్, ఇతర భూముల అక్రమణలు, కొనుగోళ్లు జరిగాయన్న ఆరోపణల నిగ్గు తేల్చాలని విచారణ కమిటీకి నిర్దేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఉత్తర్వులు జారీచేశారు. సంబంధిత జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణ సంబంధిత జీవోను బుధవారం జారీ చేసినప్పటికీ ఇది గురువారం వెలుగులోకి వచ్చింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేనను కమిటీ ఛైంపర్సన్‌గా నియమించారు. స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ ల్యాండ రికార్డ్స్ శాఖల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఘూతోపాటు ఆయా భూములున్న జిల్లాలకు చెందిన కలెక్టర్‌లు సభ్యులుగా ఉంటారు. తుది నివేదిక ఇచ్చేలోగా అంశాల తీవ్రతను అనుసరించి మధ్యంతర నివేదికలను సమర్పించాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. రంగారెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, హైదారాబాద్ జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణను ఈ కమిటీ చేపట్టనుంది.

### సామాజిక సంస్కరణలపై
## దృష్టి పెట్టండి



**న్యూఢిల్లీ :** ఓటు బ్యాంకు రాజకీయాలకు బదులుగా సామాజిక సంస్కరణలు, సానుకూల మార్పులపై దృష్టి సారించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలకు శుక్రవారం పిలుపునిచ్చారు. వారణాసి నుంచి వాద్‌నగర్ వరకు సాగుతున్న సేవా యాత్ర (మోటార్ సైకిల్ ర్యాలీ)లో పాల్గొంటున్నవారితో వర్చువల్‌గా మాట్లాడారు. గత 12 ఏళ్లలో దేశంలోని నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఎంతో మెరుగుపడ్డాయని మోదీ పేర్కొన్నారు. దేశంలో మహిళల్లో స్వయం సమృద్ధి కూడా పెరిగిందని ఆయన అన్నారు."మహాత్మా గాంధీ జీవితాన్ని పరిశీలిస్తే, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటం, స్వాత ంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించడంతో పాటు, ఆయన ఒక గొప్ప సామాజిక సంస్కర్తగా కూడా నిలిచా రని మనకు అర్థమవుతుంది. సమాజంలో ఉన్న దురా చారాలకు వ్యతిరేకంగా ఆయన ఎల్లప్పుడూ కృషి చేశారు. కాబట్టి రాజకీయ కార్యకర్తలుగా మనం కూడా ఓటు బ్యాం కుల గురించి ఆలోచించకుండా, సామాజిక సంస్కరణ, సానుకూల మార్పు దిశగా కృషిని కొనసాగించాలి.

### ఖైరతాబాద్ మహాగణపతి
## శోభాయాత్ర ప్రారంభం

- భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య కొనసాగుతున్న యాత్ర
- 10 రోజుల్లో 25 లక్షల మందికి పైగా భక్తుల దర్శనం
- ఈ ఏడాది 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనం
- హైదరాబాద్‌కే తలమానికమైన ఖైరతాబాద్ మహాగణపతి



**హైదరాబాద్ :** శోభాయాత్ర శుక్రవారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. దీంతో నగరంలో పది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి.ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహా గణపతి'గా దర్శనమిచ్చిన 69 అడుగుల భారీ విగ్రహాన్ని గురువారం రాత్రి దర్శనాలు ముగిసిన అనంతరం ప్రత్యేక భారీ రవాణా వాహనం (ట్రాన్స్‌పోర్టర్)పైకి చేర్చారు. వెల్డింగ్ పనులు, ఇతర తుది ఏర్పాట్ల కారణంగా ఉదయం 6 గంటలకు బదులుగా కాస్త ఆలస్యంగా శోభాయాత్ర మొదలైంది. మధ్యాహ్నం 2 గంటల కల్లా హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఖైరతాబాద్ మండపం నుంచి బయలుదేరిన ఈ యాత్ర రాజీవ్ గాంధీ విగ్రహం, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మీనార్, తెలుగు తల్లి జంక్షన్, సచివాలయం మీదుగా ట్యాంక్ బండ్‌కు చేరుకుంటుంది. ఈ యాత్ర సందర్భంగా పోలీసులు నగరం అంతటా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. వేలాది మంది సిబ్బంది, ప్రత్యేక బృందాలను మోహరించి, ఊరేగింపు సాఫీగా సాగేలా పర్యవేక్షిస్తున్నారు.పర్యావరణ హితంగా మట్టితో రూపొందించిన ఈ విగ్రహాన్ని పది రోజుల పాటు 25 లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

### ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాలపై
## విజిలెన్స్ అధికారులు తనిఖీలు




**హైదరాబాద్ :** జేఎన్‌టీయూ, ఓయూ పరిధుల్లోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల తీరు ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాలపై విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతి కళాశాల విస్తీర్ణం, తరగతి గదుల పొడవు, వెడల్పులను లెక్కపెడుతున్నారు. బోధనా ప్రమాణాల తీరును బేరీజు వేసేందుకు జేఎన్‌టీయూలోని ఆచార్యుల సహకారం తీసుకుంటున్నారు. వారిని వెంటబెట్టుకుని తీసుకెళున్నారు.ఆ రెండూ విశ్వవిద్యాలయాలే కాకుండా హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు అధికారులు వెళ్లి ఎంపిక చేసుకున్న అంశాలపై యాజమాన్య ప్రతినిధులను లిఖితపూర్వక వివరాలను కోరుతున్నారు. విద్యార్థులు, ప్రొఫెసర్ల నిష్పత్తికి అనుగుణంగా అసిస్టెంట్ ప్రొపెసర్లు ఉన్నారా లేదా అన్న అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. జేఎన్‌టీయూ, ఉస్మానియా వర్సిటీల అనుబంధ గుర్తింపు అఖిల భారత సాంకేతిక విద్యామండలి అనుమతులతో ప్రవేశ పెట్టిన కోర్సుల వివరాలను తీసుకుంటున్నారు.

## యూరియా యాప్‌తో ఇక్కట్లు



**లక్షెట్టిపేట(మంచిర్యాల):** ఆన్‌లైన్‌లో యూరియా బుకింగ్‌తో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. వ్యవసాయానికి సంబంధించి ప్రస్తుతం అన్ని ఆన్‌లైన్ యాప్‌లతో కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రస్తుతం యూరియాతో పాటు డీఏపీ, పొ టాస్, 20.20అన్ని కూడా ఆన్‌లైన్ చేసుకోవాలని ఎక్కడ స్టాక్ ఉంటే అక్కడ నుంచి తెచ్చుకోవాలన్న నిబంధనలు పెట్టడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొంత మంది రైతులకు యాప్‌లపై అవగాహన కూడా లేకపోవడం ఒకెత్తయితే మరికొంత మందికి అసలు స్మార్ట్ ఫోన్లుకూడా లేకపోవడం మరో సమస్య. చేసేది లేక చాలా మంది తమ బంధువులు, తెలిసిన వాళ్లతో బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి.ప్రభుత్వం రైతులకు అందించే యూరియా, డీఏపీ, పొటాస్, 20.20 సాగుకోసం రైతులు పొందాలంటే యా ప్‌లో బుక్ చేసుకోవాలి. అది బుక్ చేసుకోవాలంటే ముందుగా స్మార్ట్ ఫోన్ కలిగి ఉండాలి. అంతే కాకుండా ఆధా ర్ కార్డుతో అనుసంధానం అయిన ఫోన్‌నంబర్ కలిగి ఉండాలి. దీంతో పాటురైతుకుసంభందించిన పట్టాదారు పాసు పుస్తకం సైతం ఫోన్ నంబర్‌కు లింక్ ఉండి పూర్తి వివరాలను యాప్‌లో పొందుపర్చాలి.

### సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి
## ఈడీ నోటీసులు




**హైదరాబాద్, సెప్టెంబర్ 25 :** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ అధికా రులు నోటీసులు జారీ చేశారు. సాహితీ ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ కేసులో ఈ సమన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన ఆయన విచారణకు రావాలని ఈ నోటీసులో తెలిపారు. రూ.2.1 కోట్ల లావాదేవీలపై ఈడీ అధికారులు ఆరా తీయనున్నారు. తెలంగాణ పోలీసులు నమోదు చేసిన FIR ఆధారంగా ఈడీ అధికారులు ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది.ప్రీ లాంచ్ పేరుతో కొనుగోలు దారుల నుంచి నగదు వసూలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నిధులను కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన విషయం తెలిసిందే. మరో విడతలో రూ.12.6 కోట్ల ఆస్తులను అటాచ్ చేశారు. ఇప్పటివరకు 56 బ్యాంక్ ఖాతాలను అధికారులు సీజ్ చేశారు.

మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ



# జిల్లెల్లలో డెంగ్యూ కలకలం.. అప్రమత్తమైన ఆరోగ్య శాఖ

**ఇంటింటి సర్వే.. 50 మందికి పైగా వైద్య పరీక్షలు**

**పరిసర ప్రాంతాల్లో యాంటీ లార్వా, పైరెథ్రిన్ స్ప్రే**

**తంగళ్లపల్లి, సెప్టెంబర్ 25, ప్రజావాణి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదవడంతో ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధి మరింత వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ జ్వర లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు చేస్తున్నారు.
గ్రామానికి చెందిన సవడవేని లక్ష్మవ్వ (భర్త వెంకటయ్య)కు డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ఆరోగ్య శాఖ సిబ్బంది ఆమె నివాస పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా యాంటీ లార్వా మందును పిచికారీ చేయడంతో పాటు, దోమల నివారణకు పైరెథ్రిన్ స్ప్రే చేపట్టారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తూ ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపి హెచ్ ఈఓ కె.రాజు మాట్లాడుతూ..



గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన సర్వేలో 50 మందికి పైగా వైద్య పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.నేరెళ్ల మెడికల్ ఆఫీసర్ చంద్రిక మాట్లాడుతూ.. జిల్లెల్ల గ్రామంలో డెంగ్యూ నివారణ చర్యలను మరింత ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో గ్రామంలో ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. గ్రామస్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆరోగ్య శాఖ సిబ్బంది సూచించారు.

# నిండుకుండలా మారిన తోటపల్లి చెరువు

**వరుస వర్షాలతో జలకళ సంతరించుకున్న రిజర్వాయర్**

**బెజ్జంకి, సెప్టెంబర్ 25 (ప్రజావాణి)** బెజ్జంకి మండలంలోని తోటపల్లి రిజర్వాయర్ వరుస వర్షాలతో నిండుకుండలా మారి మత్తడి దూకుతోంది. భారీగా వరద నీరు చేరడంతో రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. చెరువు నిండడంతో సాగునీటికి, బోరుబావులకు నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. నీటి నిల్వతో చేపల వేటకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో ముదిరాజ్‌లు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ నిండుకుండలా మారడంతో రైతులు, ముదిరాజ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ధూళ్మిట్ట పాఠశాల మరో ఘనత

**జిల్లాస్థాయి యువ టూరిజం క్లబ్ పోటీల్లో మూడో స్థానం**

**మద్దూరు సెప్టెంబర్25, ప్రజా వాణి,**
సిద్దిపేట జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ టూరిజం క్లబ్ జిల్లా స్థాయి పోటీల్లో ధూళ్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మూడో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.జిల్లాలోని 78 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో ధూళ్మిట్ట పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో ప్రతిభ చాటారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఇందుకు కృషి చేసిన యువ టూరిజం క్లబ్ గైడ్ టీచర్లు,విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక చరిత్ర,వారసత్వ సంపదతో పాటు మరుగునపడిన పర్యాటక ప్రదేశాలను వెలుగులోకి



తీసుకురావడం,పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఈ విజయానికి దోహదపడ్డాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాఠశాల ఉత్తమ ప్రతిభ కనబరిచి అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.

# ఇంటి చుట్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- గాగిల్లాపూర్ గ్రామ సర్పంచ్ కనకచంద్రం**




**మద్దూరు సెప్టెంబర్ 25, ప్రజా వాణి**
మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ ఇట్టబోయిన కనక చంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రతి ఇంటిలో మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలని ఇంకుడు గుంతలు లేనివారికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు.పిచ్చి మొక్కలు గడ్డి తొలగించుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షాలు కురుస్తున్న పరిస్థితుల వల్ల జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రజియా, ఏఎన్ఎం నిర్మల,గుడిసె అరుణ, దాసరి చంద్రకళ, సి ఎ ఆంజనేయులు, కారోబార్ శ్రీకాంత్,ఆశా వర్కర్ బాబాయ్ తదితరులు పాల్గొన్నారు

# పాలేరు జలాశయాన్ని పరిశీలించిన కలెక్టర్ దివాకర్ టీఎస్







**ప్రజావాణి కూసుమంచి -- సెప్టెంబర్ 25**

తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాలేరు జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ శుక్రవారం పాలేరు జలాశయాన్ని పరిశీలించారు. జలాశయానికి చేరుతున్న వరద నీటి ప్రవాహం, నీటిమట్టం, కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జలాశయానికి సుమారు 11 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పాలేరు ఎడమ కాలువకు 2 వేల క్యూసెక్కులు, పాత కాలువకు 150 క్యూసెక్కులు, భక్త రామదాసు ఎత్తిపోతల పథకానికి 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి ఎత్తిపోతల పథకాల మోటార్లను ఆన్ చేయాలని ఇరిగేషన్ శాఖ ఎస్సీ మంగళపూడి వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. వరద పరిస్థితుల దృష్ట్యా పాలేరు వాగు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ శాఖ ఎస్సీ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ఉన్నారు

# డ్రై డే--ఫ్రైడేలో పారిశుధ్యంపై అవగాహన

**ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఆశా వర్కర్ లావణ్య**





**తంగళ్లపల్లి, సెప్టెంబర్ 25, ప్రజావాణి:** తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో 'డ్రై డే--ఫ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటి పరిసరాలను పరిశీలించి, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు నివారణ స్ప్రే పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ లావణ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, పారిశుధ్యాన్ని పాటిస్తే దోమల ద్వారా వ్యాపించే అనేక రకాల రోగాలను నివారించవచ్చని తెలిపారు.

# ఈశ్వరమాధారంలో రీసర్వే పరిశీలించిన కలెక్టర్ దివాకర



**ప్రజావాణి కూసుమంచి -- సెప్టెంబర్ 25**
కూసుమంచి మండలంలోని ఈశ్వరమాధారం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ డి. సైదులుతో కలిసి రీసర్వే జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్న కలెక్టర్, సర్వే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూముల రీసర్వే సమయంలో రైతుల వివరాలు, భూముల సరిహద్దులు, పక్క రైతుల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా సర్వే ప్రక్రియను సంబంధిత రైతుల సమక్షంలోనే నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. భవిష్యత్‌లో భూ వివాదాలకు తావులేకుండా రికార్డుల్లో వివరాలు సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు రీసర్వే ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

# శివశక్తి యూత్ లడ్డూను వేలంపాటలో కైవసం చేసుకున్న రామాయపల్లి సర్పంచ్ బాగానొల్ల రేణుక తిరుపతి



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్25, మన ప్రజావాణి:**వినాయక నవరాత్రులలో భాగంగా చిన్నశంకరంపేట మండల పరిధిలోని రామాయపల్లి గ్రామ శివశక్తి యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నవరాత్రులు , భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న ఆది దేవుని వినాయకుని లడ్డూను బాగాన్నోల్ల రేణుక తిరుపతి వేలంలో కైవసం చేసుకున్నారు. అనంతరం రామయపల్లి సర్పంచ్ బాగాన్నోల రేణుక తిరుపతి మాట్లాడుతూ వేలంలో సొంతం చేసుకున్న లడ్డును బిఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంటారెడ్డి తిరుపతి రెడ్డి గారు మెదక్ ఎమ్మెల్యే కావాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలకు పంపిణీ చేశామని తెలిపారు. నిత్యం ప్రజాసేవలో ప్రజల మధ్యనే ఉంటూ కష్ట సుఖాలలో పాలుపంచుకుంటున్న కంటారెడ్డి తిరుపతి రెడ్డి గారు గణనాథుడు ఆశీస్సులతో మెదక్ ఎమ్మెల్యేగా ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని ఆ భగవంతున్ని ప్రార్థించామని సర్పంచ్ తెలిపారు.

# బాబా నగర్‌లో ఘనంగా అంబేద్కర్ వినాయకుడి నిమజ్జనం

**జోగిపేట, సెప్టెంబర్ 25:** మన సమగ్ర ప్రజావాణి సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం జోగిపేట పట్టణంలోని 14వ వార్డు న్యూ బాబా నగర్ కాలనీలో అంబేద్కర్ వినాయక సంఘం ఆధ్వర్యంలో గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాలనీ వాసులంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆటపాటల మధ్య గణేశుడిని నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా రాత్రి నిర్వహించిన లడ్డూ వేలంపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 8 కిలోల బరువున్న మొదటి లడ్డూను ముర్కగల్ల దేవేందర్ రూ.52,500లకు దక్కించుకున్నారు. 2 కిలోల బరువున్న రెండో లడ్డూను జోగ్యల్ల అనుప రూ.23,400లకు దక్కించుకున్నారు.ప్రతి సంవత్సరం బాబా నగర్ కాలనీలో అంబేద్కర్ వినాయక సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలతో పాటు లడ్డూ వేలంపాటలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో కాలనీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.




Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com